

# పిచ్చాసుపత్రి సంభాషణలు

తనికెళ్ల భానుమూర్తి

(అష్టావధాని)

సత్యవరం పిచ్చి యాసుపత్రియందు సాక్షిగారు తరుచుగా సంచారం వేంచేయించుచూ అచ్చటి వింతలను వినిపించగా విని యానందించుట మనకు చిరకాలము నుండి అలవాటైపోయినది గాని యే కారణముచేతనో సాక్షిగారు చాలకాలమునుండి రంగస్థలముపై కనుపించ లేదు. అయినప్పటికి యిప్పుడిప్పుడే పిచ్చాసుపత్రి సమాచారములు కొన్ని మనకు తెలియగల మార్గమొకటి మనకు దొరికినందుకు మరల మాకందరకూ ఆనందము కలుగుచున్నది. ఈ సమాచార మిట్లే కొంతకాలము పాటు మనకు తెలియుచుండే గలదను ఆశగూడ చూపుచున్నది: ఎట్లాగందురేమో?

ఈ మధ్య మా యూరినుండి ఒకడు పిచ్చాసుపత్రిలో పొరపాటువశాత్తు గానో కర్మవశము చేతనో నమోదు చేయబడినాడు. అతడు ఆసుపత్రియందు ప్రతిదినము జరుగుచుండు లోకాభిరామాయణమును చేతనైనంత వరకు కాగితములపైని వ్రాయుచూ, వారమునకో పది రోజులకో ఒకసారి తానట్లు సేకరించిన సంభాషణలను ఒక ఉపన్యాసరూపముగా వ్రాసి నాకు పంపుచున్నాడు. అవి నేను ప్రకటింపదలచినాను. ప్రస్తుతము అతను పంపిన వాటిలో మొదటిది యిచ్చట ప్రకటించుచున్నాను. సావధానులరై, చదువుకొని సంతోషింపుడు.

## 1-వ సంపుటి

అమ్మయ్యలారా!

నాకు చిన్నప్పటినుండియు 'చేను బాధ' తీవ్రముగా ఉండుటచేత తగిన ఇంగ్లీషు మందుకొరకు ప్రయత్నించితిని, గాని ఎన్ని మందు లుపయోగించినను బాగు పోలేను. గత్వా గత్వా, పేపర్లలో "సత్యవరం పిచ్చాసుపత్రి" అన్న ప్రకటనలను చూచి, అందలి 'గ' వర్ణమును గంగ్యముగా నూహించి, మందుకొరకు యాసుపత్రిలో జేరితిని. నాలుగురోజులపైని యందలి 'చ' వర్గము తాలవ్యముగా గ్రహించి, నన్నచ్చటనుండి విడుదల చేయవలసినదిగా అధికారులను కోరితిని గాని నాకు నిజముగా పిచ్చి పట్టినట్లున్నూ, ఆ పిచ్చిలోనే నేను విడుదల కోరుచున్నాననియు తలంచి గాబోలు, ఆ యధికారులు నన్ను విడుదల చేయలేదు. చేయునది లేకనే నంకే యుండవలసి వచ్చినది. ఊరక యుండుటకు అలవాటు లేనివాడ నగుటచేత ఆసుపత్రియందు నిత్యము పిచ్చివారిలో జరుగు సంభాషణలను కాగితములపై వ్రాయుచు, ఉపన్యాసరూపముగ తయారుచేసి ప్రకటనకొరకు పంపుచున్నాను. అందులో మొదటిది ఇది. ఇందులో ఇరువురు పిచ్చివారు మాట్లాడుకొనుచుండుటనుగూర్చి మాత్రమే వ్రాయబడినది గాని యిందులో మొదటి కాగితము ఎచ్చటనో పోయినది. ఇగువాయి మాత్రమే చదివి యానందింపుడని నా కోరిక.

1-వ వాడు:—అంతేనోయి, గాడిదా! ఎలుకలను పిల్లి చంపితే పిల్లిని కుక్క—పీకి పాకం పట్టేస్తుంది. ఎక్కడికి వెళ్ళినా యింతే! ఇనాము లూడితే, యెస్టేట్లు మాత్రం ఉండిపోతాయా!

2-వ వాడు:—ఆఁ! శాంతం, శాంతం: నీ యినాములూ నువ్వూ మా ముందర ముష్టెత్తడానికైనా పనికి రావు! తెలిసినదా! ఎస్టేటు దారుణ్ణన్న సంగతి తెలుసుకోకుండా కూస్తావేం! 'పట్టు' మని కాంభోజీ రాగంతో "భవతి భిక్షాందేహి" అన్నముక్క— పదిమందికి వినబడేటట్లు అనలేని నీ కెక్కడ, అక్షయ పాత్ర యెక్కడ! ఛీ, అవతలకు ఫో:—

1-వ వాడు:— మొన్నటి తాలూకా బోర్డుల గడబిడలలో వేలకొద్ది కాల్చుకుని మొంబగు షిష్పాలు, ! పెసి

డెంటు పదవులు సంపాదించిన వాళ్లకి తెలుస్తుంది గాని, నీలాంటి వెఱ్ఱి ముండావాడికి "భవతి భిక్షాం దేహి" అన్న ముక్క ఎల్లా తెలుస్తుందోయి దైను ముండావాడా! కావలసివస్తే చూడు. నే నెవణ్ణో తెలుసునా నీకు? బోర్డు పదవుల గడబిడలలో పన్నెండువేలు వఱదల్లాగ పారించి చివరకి బాకీదార్లు తెచ్చిన దావాల బాధ నివారించుకునేందుకు పిచ్చివాడననే నెపంతో యిచ్చట చేరేను. తెలిసిందా! ఈ సంగతి మరిచేవంటే సోడుతో కొడ్తాను. జాగ్రత్త!

2-వ వాడు:—నీ బెదిరింపు లవతల పెట్టు. ఇదిగో నా 'తంబురా' చూచేవా! దీనితో నాలుగు తంతే నీకు మీ జిల్లా బోర్డు ప్రెసిడెంటుకి బుద్ధి వచ్చేటట్లుంది. "నాకు పిచ్చి లేదు" అని అంటూనే ఉంటావు. వెఱ్ఱి వెఱ్ఱిగా కేకలేస్తూనే ఉంటావు.

1-వ వాడు:—అదిగో మళ్ళీ మా జిల్లా బోర్డు ప్రెసిడెంటు పేరెత్తుతున్నావు. జాగ్రత్త! ఈమాటు ఆయన్ని గురించి అన్నావంటే గూబ పగలేస్తాను. ఎవ రనుకున్నావాయన్ని...అదిగో! ఆ దివ్య మంగళ విగ్రహం. ఫ్రంచి కటింగు క్రాపింగుతో మందపల్లి శనైశ్చరుడికి మల్లే దేదీప్యమానమైన శరీరంతో ఆయన ఇల్లా వస్తూన్నారు. లే! లేచి ఆయన కాళ్లకి దండం పెట్టు. దయచేయండి స్వామీ, లే! లే! అపరాధం క్షమించమను. ధ్యానం చెయ్యి. "శుక్లాంబరధరం......" స్వామీ "రండి." లేరా ముక్కు రాచిపో. లేచి ఆ కొండవీటి చేదత్రాడు యిల్లా పట్టుకురా. ఆc! తెచ్చా! ఆ చివర శ్రీ ప్రెసిడెంటువారి పిలక్కి ముడిపెట్టు. ఆc! యీ రెండో చివర శ్రీవారి పాదాలకి కట్టు. ఇప్పుడు బోధపడిందా? ఈ త్రాడే నారి. శ్రీ అనంతులవారు. ఈయన సాక్షాత్తు శ్రీ మహావిష్ణువు. తెలిసిందా! నేను శంకరుణ్ణి.

చ॥ "కదలని తేరు, తేరుగడ కానక పూనిన
నారి, నారితో బొదలినతూపు, తూపు
నెరి బ్రోచిన మావులు"......

తెలిసిందా! శ్రీ ప్రెసిడెంటుగారిని, ఆ మూర్తిని, యిదుగో విడి చేస్తున్నాను. ఒక్క దెబ్బతో యీ త్రిలింగ దేశ సంహారం అయిందనుకో! నేను ఈశ్వరుడు త్రిపురాల్ని గూల్చలేదూ. ఇప్పుడు నేనూ అంతే! పట్టు! ఆc! విడి చేస్తున్నాను కాచుకో!......

2-వ వాడు:—ఓరి నీ దుంప తెగా! నిన్ను బూడిద చెయ్యా! త్రిలింగ దేశ సంహారమే. ఆంధ్రుడవై పుట్టి, ఆంధ్రదేశంలో, పెరిగి ఆంధ్రుల డబ్బు లక్షలకి లక్షలు తిని చివరకి ఆంధ్రదేశ సంహారానికే పూనుతున్నావా!

1-వ వాడు:—ఆగవోయి పశువా! నాకు అడ్డు తగిలి బ్రతికినవాడేడీ: నువ్వనగా ఎంత. ఒక్క తాపుతో అవతల పడతావు. నోరుముయ్యి, రా, పట్టు మహాసమయం. ఈ రోజున ఈ సంహారం అవక తీరదు. ఓం. భం. ఫం. భం. శంభో మహాదేవ శంభో......

2-వ వాడు:—చెంబో........

1-వ వాడు:—ఓరి నిన్ను తగలెయ్యా! మళ్లీ చెంబెందుకురా! నీకు కావలసి ఉంటే మా ఊరురా! ప్రశస్తమైన ఆలమూరు టెంకాయ చిప్పలు నిన్ను తగలేసి నన్ని యిప్పిస్తాను. శాశ్వతంగా తరతరాలు యాయవారం చేసుకోవచ్చును.

2-వ వాడు:——ఓయి, బోడి దాసరయ్యా! నీకయితే టెంకాయ చిప్పలుగాని, మా విష్ణుమూర్తిగారికి చెంబు ఉండవద్దుటోయి.

1-వ వాడు:—ఆc. అల్లా దారికి రావోయి! ఇప్పుడు నిజం తెలిసింది నీకు. శ్రీ శంకరస్వామికి "పుఱ్ఱెదాల్పు" అని పేరున్నప్పుడు, విష్ణుమూర్తిగారికి "చెంబుదాల్పు" అని ఉండకపోవటం ఎల్లాగ? ఈ విషయమై వచ్చే లెజస్లేటివు కౌన్సిలు మీటింగులో ఒక బిల్లు నేను పెడుతున్నాను. నీ వోటు నాది. ఏమంటావు?

2-వ వాడు:—నా వోటు యిప్పటికి ముగ్గురు అడిగినారు. సనాతనం పార్టీవారు జస్టిసు పార్టీవారు కాంగ్రెసు పార్టీవారున్నూ. నువ్వు నాలుగోవాడివి.

1-వ వాడు:—ఓరి మాలవాడి కొడుకా! అఖండమైన ఆదిద్రావిడ కుటుంబములో పుట్టి అవధానినని అనిపించుకున్న నన్ను నాలుగోవాడ నంటావా! నీ నాలుక పీలికలు గానూ! ఇంక నే నూరుకోను. ఈ దెబ్బ తిని దగ్గినట్లుండు (కొట్టును).

2-వ వాడు:—(లేచి వీపు తడుముకొనుచు) పిచ్చి ముండాకొడుకా, నన్ననుకొని 'రామఖురాన్' గారి 'బూబు' నల్లా కొట్టేస్తావా! ఆయన రానీ. నీ పసరు కక్కిస్తాను. 'ఎమ్. ఎల్. సి.' అయిన దగ్గరనుంచీ మనుష్యుల్ని పోల్చలేకుండా అయిపోయినా వేంరా! గాడిదా!

1-వ వాడు:—నా పసరు కక్కించేందుకు త్రినేత్రుడు రావాలి! తెలిసిందా! ఇదిగో ఈమారట్టే నోటికి వచ్చినట్లు కూసేవంటే బీరువాలో ఉన్న "నిగొటీను" సీసా నీ నెత్తిపైని మర్దన చేస్తాను. జాగ్రత్త! ఏదో, పారిపోయిన పిచ్చివానిస్థానే వాడి పేరుతో నిన్ను నిలబెట్టి, అధికారులదగ్గర మాట రాకుండా ఉండేటందుకు నిన్ను చాలా గౌరవంగా యీ ఆస్పత్రిలో చూస్తున్నారని మహా గర్వంగా ఉంది నీకు. అధికార్లు ఎవరైనా రానీ ఈ సంగతి నేను బయ తేసేస్తాను.

2-వ వాడు:—అయితే నేను నిజంగా పిచ్చివాడను కానంటావా యేమిటి నీ ముంప తేగా! అల్లా గట్టిగా అనకేం? నేను పిచ్చివాడను కానని మా స్కూల్లో ఇన్స్పెక్టరుగారితో మాత్రం చెప్పేవంటే నాకు రావలసిన గ్రాంటు డబ్బు ఎగ వేశేస్తారు. My dear friend ఎవ్వరితోనూ చెప్పకేం!

1-వ వాడు:—చెప్పను గాని నాకు గ్రాంటులో ఏ మిస్తావు?

2-వ వాడు:—నాకు మిగలిన దాంట్లో ఒక చెంప నీది.

1-వ వాడు:—నాన్సెన్సు, గొరిగిన చెంప ఎవరికి కావాలోయి. తడి లేకపోయిన తర్వాత యీ రోజుల్లో ఎవరు చూస్తారోయి.

2-వ వాడు:—నువ్వు వట్టి 'ఇదమిద మన్నం' గాడిలా ఉన్నావే! గొరిగిన దాన్లోనే ఉంది మజా అంతాను. అందుకే బ్రాహ్మణులు, పెద్ద పెద్ద ఉద్యోగస్థులు, బుర్రలు నున్నగా గీయించుకుంటారు. తెలిసిందా! అంతేంముకూ, గొరిగినదాన్లో ఎంత విలువ లేకపోతే, బ్రాహ్మణులను జస్టిసు పార్టీలో చేరద్దామంటారో ఆలోచించుకో. ఇప్పుడు గొరిగినదే Most Valuable.

1-వ వాడు:—వారు జస్టిసు పార్టీలోకి రమ్మంటారు దిక్కులేక. మనం వెళ్లడానికి మన ఖర్మం ఏం కాలిందోయి. ఇప్పట్లో ఎవరికి వారే ఒక్కొక్క పార్టీని తయారు చేసుకోవాలి. ఈ అసుపత్రిలో ఉన్న మన వాళ్లందరమూ ఒక పార్టీగా తయారవ్వాలి. మన పార్టీ అంతా బోర్డులలోకి, కౌన్సిల్సులోకి, ఎసెంబ్లీకి ఎక్కాలి. అప్పుడు అమాంతంగా భారత దేశానికి పిలక నిగడదియ్యాలి! పట్టు! ఇవ్వాళనుండి కేన్వాసు చెయ్యాలి. నేను ప్రెసిడెంటుని. నువ్వు ఛీఫ్ మినిస్టరువి. మనలాంటి వాళ్లు పూనుకుంటేనే గాని కార్యం నడిచేటట్లు లేదు. లే! మరి ఆలస్యం ఎందుకు! అదిగో డాక్టరుగారులా వుంది. వస్తున్నారు. ఆయన్నిగుండా మన పార్టీలోకి చేర్చు—ఆ! అదిగో Lady Doctor వస్తూంది. దాన్ని పట్టుకో. చేరదియ్యి. మంచి వేడు మాట్లాడు. ఈలోగా నేనూ వస్తాను.

డాక్టరు గారు:—ఏయ్. Shut up!

డబ్బు కావలెనా?

తిరిగి యివ్వకుండా డబ్బును పొందుట కొక మార్గము కలదు. ఇది మీకు యిష్టము లేదా?

1 రూపాయనిచ్చి రూ. 3000 లను పొందుడు.

అప్పు కాదు! కష్టపడి తిరిగి యిచ్చెడి దఫాల వారీ పైకము కాదు. పెట్టుబడి కాదు!!

మీకు తృప్తియా?

వివరములకు, చేతి పరిశ్రమల యభివృద్ధి నిధి, వేలూరు, అని వ్రాయుడు.